



EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
14-02-2026
పేజీలు: 02


# ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఫెయిల్



మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై జాగృతి అధ్యక్షురాలు కవిత స్పందించారు. ఈ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పాయని మండిపడ్డారు. తాము ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్‌తో కలిసి పోటీ చేసి మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. తమ మద్దతుతో పోటీ చేసిన వడ్డేపల్లి అభ్యర్థులు ప్రలోభాలకు గురయ్యారని విమర్శించారు. శనివారం ఆమె జాగృతి కార్యాలయంలో ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ హామీ అమలు చేయని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ముందంజలో నిలిచిందని.. తెలంగాణ తామే తెచ్చినం అని చెప్పకున్న బీఆర్ఎస్ పార్టీ అత్యంత దయనీయస్థితికి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చేస్తామని చెప్పకుంటున్న బీజేపీ ఒక్క కార్పొరేషన్‌కు పరిమితమితమైందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ చివరకు తోక పార్టీ అయిన సీపీఐకి తోక పార్టీగా మారిపోయిందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతిని ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పకొచ్చారు. ఈ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ 'ఏ సిర్ఫ్ ట్రైలర్ హై.. పిక్చర్ బాకీ హై' అంటూ ఆమె వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షం బలంగా లేకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీ మెరుగైన ఫలితాలు సాధించిందని చెప్పకొచ్చారు. తానే గతంలో మున్సిపల్ శాఖా మంత్రిగా ఉన్నానని.. తాను మున్సిపాలిటీలను ఎంతో అభివృద్ధి చేశానని కేటీఆర్ చెప్పకున్నప్పటికీ ఆయనను ప్రజలు నమ్మలేదని పేర్కొన్నారు. 'నేనే రాజు.. నేనే మంత్రి.. నాకు ఇంకో ఆరు నెలలు బోనస్' అంటూ ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని.. ముందు సీఎం రైతులకు ఇవ్వాల్సిన బోనస్ ఇవ్వాలంటూ కవిత సూచించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలు కనిపిస్తున్నాయని.. తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వకపోతే తాను సీఎం పదవినే లాక్కుంటానని రాజగోపాల్ రెడ్డి అంటున్నారని గుర్తు చేశారు. ఒక్క హామీ కూడా నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బలమైన ప్రతిపక్షం లేకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకున్నదని కవిత చెప్పకొచ్చారు. కార్యకర్తల నుంచి వచ్చిన ఒత్తిడి వల్లే తాము ఈ ఎన్నికల్లో పోటీ చేశామని కవిత వ్యాఖ్యానించారు. త్వరలోనే రాజకీయ పార్టీ పెడతామని ఇప్పటికే ప్రకటించామని.. భవిష్యత్‌లో బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతామని కవిత పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తమ కూటమికి 40 స్థానాలు వచ్చాయని చెప్పకొచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చట్టాలను ఉల్లంఘించి అధికార దుర్వినియోగానికి పాల్పడి గెలుపొందారని విమర్శించారు. 'పట్టణాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది చెప్పడం లేదని కవిత పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కొన్ని స్థానాల్లో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాయని విమర్శించారు. అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని బీఆర్ఎస్ పార్టీ మీద ఎన్నో విమర్శలు చేశారని కవిత గుర్తు చేశారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని నేరుగా కేసీఆర్ నే కూనంనేని విమర్శించారని గుర్తు చేశారు. అటువంటి నేతతో, అటువంటి పార్టీతో పొత్తు పెట్టుకుంటామని బీఆర్ఎస్ ఓపెన్ గా ప్రకటించడం.. వారి దివాళా కోరుతనానికి నిదర్శనమన్నారు. తోక పార్టీ అయిన సీపీఐకి బీఆర్ఎస్ తోక పార్టీగా మారే పరిస్థితి వచ్చిందని ఫైర్ అయ్యారు. సింగరేణి ఎన్నికల్లో కూడా జాగృతి పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు. భవిష్యత్‌లో తాము తెలంగాణ జాగృతితో కలిసి పనిచేస్తామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ స్టేట్ కన్వీనర్ అంబటి జోజిరెడ్డి స్పష్టం చేశారు. జాగృతితో కలిసి పోటీ చేసిన తమ పార్టీ నేతలను చాలా మందిని ప్రజలు గెలిపించటం సంతోషంగా ఉందన్నారు. వడ్డేపల్లిలోనూ తాము ఉద్యమసంస్థ జాగృతితో కలిసి పనిచేశామన్నారు. ఈ విషయంలో మీడియా తప్పడు ప్రచారం చేయొద్దని సూచించారు. కరీంనగర్ జిల్లాలో బీజేపీకి మెజార్టీ రాలేదని పేర్కొన్నారు. తమ పార్టీ నేతలను బలవంతంగా చేర్చుకునే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తమ పార్టీ వాళ్లను బెదిరించి కండువా కప్పారని మండిపడ్డారు. తమ పార్టీ నుంచి గెలిచిన అభ్యర్థులంతా తమతోనే ఉన్నారని చెప్పకొచ్చారు. ప్రస్తుతం దేశంలో బీజేపీ లేదని.. అమిత్ షా, మోడీ పార్టీ ఉందని పేర్కొన్నారు. కరీంనగర్‌లో బండి సంజయ్ రూ. 30 కోట్లు ఖర్చు చేశారని మండిపడ్డారు. తాము డబ్బు ఖర్చు చేయకుండా ఎన్నికల్లో పోటీ చేశామని చెప్పకొచ్చారు. హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. రామగుండం ఎమ్మెల్యే తమ వాళ్లపై గుండాయిజం, రౌడీయిజం చేస్తున్నారని మండిపడ్డారు. గెలిచిన మా అభ్యర్థులకు కండువాలు కప్పి వాళ్ల పార్టీలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారన్నారు. 'జాగృతి తరపున 34 మంది పోటీ చేస్తే ఆరుగురు గెలిచారు. అదే బీఆర్ఎస్ నుంచి 60 మంది పోటీ చేస్తే 16 మంది మాత్రమే గెలిచారు. సీపీఐ మాత్రం ఒక్కో చోట ఒక్కొక్కరితో సంసారం అన్నట్లుగా వ్యవహరిస్తోంది. కార్మికుల విషయంలో వాళ్లు పొంతన లేని స్టేట్ మెంట్ చేస్తున్నారు.' అంటూ ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ సెంట్రల్ కమిటీ మెంబర్ ఆర్ వీ ఆర్ ప్రసాద్, జాగృతి ప్రధాన కార్యదర్శి ఎల్. రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



## పేరూరు వాసి స్వప్నకు వృక్షశాస్త్రంలో డాక్టరేట్


నల్లగొండ జిల్లా పేరూరు గ్రామానికి చెందిన పసుల స్వప్న వృక్షశాస్త్రం విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. రాజస్థాన్ రాష్ట్రంలోని శ్రీ జగదీష్ ప్రసాద్ జబర్మల్ తిబ్రేవాలా యూనివర్సిటీ నుంచి ఆమె డాక్టరేట్ పొందారు. డాక్టర్ దినేష్ కుమార్ సింగ్ పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ స్పెషల్ స్పీసిస్ అవైలబుల్ ఇన్ నేచర్ అండ్ దేర్ ఇంపాక్ట్ ఆన్ డిక్రీజింగ్ ఎయిర్ పొల్యూటెన్స్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ రావడం పట్ల స్వప్న సంతోషాన్ని వ్యక్తం చేస్తూ తన కుటుంబ సభ్యులు, తోటి అధ్యాపకుల ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను మేమే కైవసం చేసుకుంటాం మహేశ్ కుమార్ గౌడ్

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కూడా తామే కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఈరోజు సమావేశమవుతానని... ఈ భేటీలో కార్పొరేషన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఎన్నికలు కల్వకుంట్ల కవితకు సంతోషాన్ని ఇచ్చి ఉండవచ్చని మహేశ్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకు పతనమవుతోందని... రాబోయే రోజుల్లో ఆ పార్టీ ప్రభావం ఉండదని చెప్పారు. మతాన్ని రెచ్చగొట్టినా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఏమీ సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ ఎన్నికల ఫలితాలతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తన పట్టును మరింత పెంచుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం



మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తోంది. మిలిటరీ అధికారులు, అత్యున్నత పదవుల్లోని వ్యక్తులకు సంబంధించిన పుస్తకాల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకురావాలని భావిస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల సిబ్బంది పుస్తకాలు రాయడానికి, ప్రచురించడానికి 20 సంవత్సరాల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' మార్గదర్శకాలను ప్రవేశపెట్టడాన్ని కేంద్రం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఆయా అధికారులు పదవుల నుంచి రిటైర్ అయిన తర్వాత ఇరవై సంవత్సరాల వరకు వారి పుస్తకాలు పబ్లిష్ కాకుండా తప్పనిసరిగా ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది. ఇటీవల జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ విషయం చర్చించారని ఆంగ్ల మీడియాలో వార్తలు వచ్చాయి. సీనియర్ సైనిక అధికారులతో సహా ఉన్నత పదవులు నిర్వహించిన వారు సున్నితమైన అంశాలపై పుస్తకాలు రాయడానికి తప్పనిసరి కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధనను తీసుకురావాలని ఎక్కువ మంది మంత్రులు సమర్థించారని తెలుస్తోంది. అయితే ఇది కేబినెట్ అధికారిక అజెండాలో భాగం కాలేదని, సాధారణ చర్చగా సాగిందని పేర్కొన్నారు.

## అదిరిపోయిన మానుషి

మానుషి చిల్లర్ ఈ అమ్మడు గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంత. తన బ్యూటీ తో ఎంతో మంది మదిని దోచుకున్న ఈ చిన్నది వెండితెరపైకి ఎంట్రీ ఇచ్చి తన నటనతో అందరినీ ఆకట్టుకుంటుంది.బాలీవుడ్ సామ్రాట్ మూవీతో సిల్వర్ స్క్రీన్ పైకి ఎంట్రీ ఇచ్చింది. కానీ ఈ మూవీ హిట్ అందుకోలేదు. అయినా కూడా ఈ అమ్మడుకు వరసగా అవకాశాలు తలుపుతట్టాయి.దీంతో వచ్చిన ప్రతి అవకాశాన్ని మిస్ చేసుకోకుండా సినిమాలు చేస్తూ వస్తున్నప్పటికీ, ఈ బ్యూటీకి ఒక్క హిట్ కూడా పడలేదు. దీంతో ఈ అమ్మడు గ్రాఫ్ కొద్ది కొద్దిగా తగ్గిపోయింది.టాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ తేజ్ సరసన ఆపరేషన్ వాలెంటైన్ సినిమాలో నటించి మెప్పించింది. కానీ ఈ మూవీ సైతం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. దీంతో తెలుగులో అంతగా అవకాశాలు రాలేదు ఈ చిన్నదానికి.





## ముంబయిలో కుప్పకూలిన మెట్రో పిల్లర్!

ముంబయిలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ములుంద్ వెస్ట్‌లో నిర్మాణంలో ఉన్న ఓ మెట్రో పిల్లర్ కుప్పకూలిపోయింది. మెట్రో పిల్లర్ రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై పడటంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డవారిని వెంటనే సమీప ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ఓ కారు, ఆటో రిక్షా పూర్తిగా ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద ఇంకా కొంతమంది చిక్కుకొని ఉన్నారన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఈ ఘటనతో మెట్రో నిర్మాణ పనుల్లో నాణ్యతపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రధాని మోదీ విదేశీ పర్యటనలకు.. గత పదేళ్లలో 762 కోట్ల ఖర్చు



ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు తరుచూ వెళ్తుంటారు. అయితే గత పదేళ్లలో అంటే 2015 నుంచి 2025 వరకు ప్రధాని మోదీ విదేశీ టూర్ల కోసం సుమారు 762 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిసింది. కేంద్ర విదేశాంగ శాఖ ఈ విషయాన్ని శుక్రవారం లోక్‌సభలో వెల్లడించింది. దీనిపై ఆ శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ప్రధాని విదేశీ టూర్లకు అయిన ఖర్చు వివరాలను ఆ సమాధానంలో చెప్పింది. ప్రధాని మోదీతో పాటు వెళ్లిన ప్రతినిధుల సమాచారాన్ని కూడా రిలీజ్ చేసింది. ప్రతి ఏడాది విదేశీ ట్రిప్‌లకు అయిన ఖర్చులో తేడా కనిపించింది. 2020లో కోవిడ్ వల్ల ఆంక్షల కారణంగా ప్రధాని మోదీ ఎక్కువగా విదేశీ టూర్లకు వెళ్లలేదు. కానీ 2021 నుంచి మళ్లీ విదేశీ పర్యటనలకు అయ్యే ఖర్చు పెరుగుతూ పోయింది. 2024 నుంచి సగటున ఏడాది ఖర్చు వంద కోట్లు దాటింది. 2025లో సుమారు 175 కోట్లు విదేశీ పర్యటనలకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. యూరోప్, అమెరికా, ఆఫ్రికా, ఈస్ట్ ఆసియా లాంటి ప్రదేశాలకు వెళ్లడం వల్ల ప్రధాని ట్రిప్ ఖర్చులు పెరిగాయి. విదేశీ పర్యటనల సమయంలో ప్రధానిని ఆ దేశం ఓ అతిథిగా ఆహ్వానిస్తుంది. ఆ దేశమే ఆతిథ్యం ఖర్చులు భరిస్తుంది. అయితే భారతీయ ప్రతినిధులకు, భద్రతా ఏర్పాట్లకు, మీడియా బృందానికి, లాజిస్టిక్ సపోర్టు ఖర్చులన్నీ ఇండియానే భరించాల్సి ఉంటుంది. 2014 నుంచి ప్రధానితో పర్యటించిన విదేశీ బృందాల్లో కనీసం 27 నుంచి 72 మంది వరకు ఉన్నట్లు తెలిసింది. 2025లో అయిదు దేశాల్లో పర్యటించిన సమయంలో అప్పడు భారత బృందంలో సుమారు 95 మంది ఉన్నారు. కరోనా మహమ్మారి నుంచి కోలుకున్న తర్వాత ఆరంభం దశలో ఖర్చు తక్కువగా ఉండేది. కానీ ఆ తర్వాత శిఖరాగ్ర సదస్సులకు వెళ్తున్న కారణంగా ఖర్చు పెరిగినట్లు తెలిసింది. ఎన్ని దేశాలు విజిట్ చేస్తున్నారు.. ఎంత దూరం ప్రయాణిస్తున్నారు.. భద్రతా అవసరాలు, బృందాల సామర్థ్యంపై ఖర్చు ఆధారపడి ఉంటుంది.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# valentine's day special movie poster













## జానర్ మార్చిన శైలేష్ కొలను

యంగ్ హీరో రోషన్ మేక (శ్రీకాంత్ కుమారుడు), టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ్' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటివరకు 'హిట్' సిరీస్, 'సైంధవ్' వంటి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.




## ఆకట్టుకుంటున్న 'శ్రీనివాస మంగాపురం' ఫస్ట్ లుక్

వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో "ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని" అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతుంది. ఇక ఈ సినిమాకు ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా మరియు ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ వంటి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.






## గౌతమ్ ఫ్యామిలీ ఫియెస్టా – ఐక్యత మరియు ఆనందోత్సవం

గౌతమ్ ఫ్యామిలీ ఫియెస్టా 14 ఫిబ్రవరి 2026న ఎంతో ఉత్సాహంగా మరియు ఆనందంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లల విద్యాభివృద్ధిలో కుటుంబ సభ్యుల పాత్ర ఎంత ముఖ్యమో తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. పాఠశాల యాజమాన్యం స్వాగత ప్రసంగంతో కార్యక్రమాన్ని ప్రారంభించింది. అనంతరం పిల్లల విద్యలో తల్లిదండ్రుల భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మా గౌరవనీయ ముఖ్య అతిథి డీన్ శ్రీ మధుకుమార్ గారు ఈ కార్యక్రమానికి విచ్చేసి తన ప్రేరణాత్మక ప్రసంగంతో అందరినీ ఉత్తేజపరిచారు. క్రికెట్, మహిళల కోసం క్యారమ్స్, వినోదాత్మక పందేలు మరియు టీమ్ గేమ్స్ వంటి వివిధ క్రీడా కార్యక్రమాల్లో తల్లిదండ్రులు చురుకుగా పాల్గొన్నారు. వారి ఉత్సాహం మరియు క్రీడాస్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది. డీన్ శ్రీ మధుకుమార్ గారి సమక్షం కార్యక్రమానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చింది మరియు ఈ వేడుకను మరింత స్మరణీయంగా మార్చింది. ఈ గౌతమ్ ఫ్యామిలీ ఫియెస్టా కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా, ఐక్యత, ప్రేమ మరియు ఆనందానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.
వినయపూర్వకంగా, గౌతమ్ మోడల్ స్కూల్ శాఖ: త్రిముల్గెర్రీ



## సత్తాచాటిన తెలంగాణ షూటర్

ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ ధవళిక దేవి కాంస్య పతకంతో మెరిసింది. శుక్రవారం జరిగిన మహిళల 50మీటర్ల జూనియర్ రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో ధవళిక అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన తుదిపోరులో ఈ తెలంగాణ షూటర్ 614.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో తొమిరిస్ అమనోవా(620.1), దరా పానోమరెంకో(615.4) వరుసగా స్వర్ణ, రజత పతకాలు దక్కించుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని గగన్ నారంగ్ షూటింగ్ అకాడమీలో కోచ్ వినోద్ కనోజియా దగ్గర గత మూడేండ్ల నుంచి ధవళిక దేవి శిక్షణ పొందుతున్నది.



## కరీంనగర్ మేయర్ పీఠం.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

కరీంనగర్ నగరపాలక సంస్థలో మేయర్ ఎన్నికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్నది ఎంసీల్ బంధమని ఆయన ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలకు బండి సంజయ్ వాలెంటైన్స్ డే శుభాకాంక్షలు చెప్పారు. కరీంనగర్ లో ఈ మూడు పార్టీలకు కలిపి 22 సీట్లు ఉన్నాయని, బీజేపీకి మేయర్ పదవి దక్కకుండా చేసేందుకే వీరంతా ఒక్కటయ్యారని బండి ఆరోపించారు. వీరి చిల్లర రాజకీయాలు, కుట్రలు త్వరలోనే కరీంనగర్ వేదికగా బయటపడతాయని పేర్కొన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ఫోన్ చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చెబుతుంటే, మరోవైపు బీఆర్ఎస్ నేతలతో మాట్లాడాలని కాంగ్రెస్ కూడా సూచిస్తోందని, ఇది వారి రహస్య



ఒప్పందానికి నిదర్శనమని మండిపడ్డారు. కరీంనగర్ ప్రజలు స్పష్టంగా బీజేపీకి ఓటు వేశారని, ప్రజా తీర్పును గౌరవించకుండా మేయర్ పదవిని అడ్డుకోవాలని చూస్తే కరీంనగర్ దమ్మేంటో చూపిస్తామని బండి సంజయ్ హెచ్చరించారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కరీంనగర్ మేయర్ పీఠం మాత్రం కచ్చితంగా బీజేపీదేనని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

## నిజామాబాద్ పేరును మారుస్తాం : ఎంపీ అరవింద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ఓటుకు నోటు కేసులో అండర్ ట్రయల్ లో ఉన్నారు.. ఆయన్నే ఎత్తుకెళ్తారు పోలీసులు అని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్యానించారు. బండి సంజయ్ వారియర్ లాంటి వాడని అర్జునుడు రోల్ కు సెట్ అవుతారని చెప్పుకొచ్చారు. కృష్ణునిలా స్టీరింగ్ నా చేతిలో ఉండే దాకా ఓకే అంటూ సోషల్ మీడియాలో కృష్ణార్జునుల వైరల్ పోస్ట్ పై ఎంపీ అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ లో ఎంపీ అరవింద్ మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్ మేయర్ స్థానం కోసం తాము కాంగ్రెస్ లా దిగజారం అని స్పష్టం చేశారు. తాము ఒక ఐడియాలజీ తో ముందుకు వెళ్తున్నామని తేల్చి చెప్పారు. సంఖ్యలు కాదు.. పదవులు తమకు ముఖ్యం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక బ్రోకర్ పార్టీ.. విషపు పురుగులు అన్న ఎంఐఎం తో పొత్తు ఎందుకని ప్రశ్నించారు. ఇందూరులో టెక్నికల్ గా ఫెయిల్ అయ్యాం.. ప్రాక్టికల్ గా గెలిచామని తెలిపారు.

